క్లుప్తంగా

మద్యం తాగి బైక్ నడిపిన వారికి జరిమానా

కాకినాడ లీగల్: మద్యం తాగి బైక్ నడిపిన కేసుల్లో ఆరుగురికి రెండు రోజుల చొప్పున జైలు, 14 మందికి జరిమానా విధిస్తూ కాకినాడ మూడో అదనపు జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ డి.శ్రీదేవి తీర్పు చెప్పారు. వివరాల్లోకి వెళితే కాకినాడ ట్రాఫిక్–1, 2 పోలీసు స్టేషన్ పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేశారు. సోమవారం కోర్టులో 20 మందిని హాజరుపర్చగా వారికి జైలు, జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

వేసవిలో చలివేంద్రాలు ఎంతో అవసరం



బాటసారులకు మజ్జిగ పంపిణీ

బోట్‌క్లబ్: వేసవిలో చలివేంద్రం ఏర్పాటు చేయడం ఎంతో అవసరమని ఎన్‌టీఆర్ హెల్త్ యూనివర్సిటీ రిటైర్డు వీసీ ఐవీ రావు అన్నారు. భరద్వాజ సేవా సంఘం ఆధ్వర్యంలో స్థానిక రామారావుపేటలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. వివిధ సంఘాలు, స్వచ్ఛంద సేవా సంస్థల ఆధ్వర్యంలో చలివేంద్రాలు ఏర్పాటు చేసి పాదచారులకు, వాహనదారులకు దాహార్తిని తీర్చాలని ఐవీ రావు కోరారు. చలివేంద్రంలో మజ్జి, మినరల్ వాటర్ పంపిణీ చేయడానికి ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అయ్యగారి వెంకటేష్, మండలిక శాస్త్రి, కె సీతారామ్, వీఎస్ మురళీరావు, ఎంవీ నారాయణ, చెరుకువాడ శాస్త్రి, ఇంద్రగంటి నాగేశ్వరి పాల్గొన్నారు.

డాక్టర్ విఠల్‌కు ఇన్‌చార్జి బాధ్యతలు

కాకినాడ క్రైం: కాకినాడ జీజీహెచ్ సూపరింటెండెంట్‌గా ఆర్థోపెడిక్ హెచ్‌వోడీ డాక్టర్ ఎం.పాండురంగ విఠల్‌కు ఇన్‌చార్జి హోదాలో పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. సోమవారం ఈ ఉత్తర్వులు వెలువడ్డాయి. తాజా ఉత్తర్వుల నేపథ్యంలో డాక్టర్ విఠల్‌కు కీలకమైన చెక్ పవర్ సంక్రమించింది.

ఎస్సీలకు కులధ్రువీకరణ పత్రాలు మంజూరు చేయాలి



కలెక్టర్ షణ్మోహన్‌కు వినతిపత్రం అందజేస్తున్న దోకుబుర్ర భద్రం

కాకినాడ సిటీ: ఎస్సీ వర్గీకరణ జీవో ఏపీ ఆర్డినెన్స్ ప్రకారం ఆయా వర్గాలకు కులం ధ్రువీకరణ సర్టిఫికెట్లు జిల్లాలోని అన్ని తాహసీల్దార్ కార్యాలయాలు, గ్రామ, వార్డు సచివాలయాలకు త్వరితగతిన అందించేందుకు ఆదేశాలు జారీ చేయాలంటూ ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ మాజీ సభ్యులు దోకుబుర్ర భద్రం కలెక్టర్ షణ్మోహన్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. ఎస్సీలోని 59 ఉపకులాలను విద్యా ఉద్యోగాల్లో సమాన అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా ఎస్సీలను గ్రూప్ 1, 2, 3 అనే మూడు కేటగిరీలుగా వర్గీకరించారన్నారు. ప్రభుత్వ ఆర్డినెన్స్ జీవో ప్రకారం కులధ్రువీకరణ పత్రాలు త్వరితగతిన జారీ చేసేలా సర్క్యులర్ జారీ చేయాలని కోరినట్లు భద్రం తెలిపారు.

ఎలక్ట్రికల్ బైక్ దగ్ధం



అగ్నికి ఆహుతవుతున్న ఎలక్ట్రికల్ బైకు

కాకినాడ క్రైం: హఠాత్తుగా ఎలక్ట్రికల్ బైకు నుంచి మంటలు చెలరేగి దగ్ధమవడంతో వాహనచోదకుడు, ప్రయాణికులు భయాందోళనతో పరుగులు తీశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సోమవారం ఓ వ్యక్తి తన ఎలక్ట్రికల్ ద్విచక్రవాహనంపై కాకినాడ సినిమా రోడ్డు నుంచి కోకిలా సెంటర్ వైపు వెళుతున్నాడు. ఫ్లై ఓవర్‌పై ప్రయాణిస్తుండగా సరిగ్గా వంతెన మధ్యలో ఒక్కసారిగా వాహనం నుంచి మంటలు చెలరేగాయి. దీంతో కంగుతిన్న వాహన చోదకుడు భయంతో తన వాహనాన్ని అక్కడే వదిలేసి పారిపోయాడు. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న పోలీసులు, ఫైర్ సిబ్బంది అక్కడికి చేరుకొని మంటలను అదుపు చేశారు. బైక్ కంపెనీపై స్పష్టత లేదని పోలీసులు తెలిపారు. వాహనం విలువ సుమారు రూ.లక్ష ఉంటుందని అంచనా వేశారు. చోదకుడి జాడ కానరాకపోవడంతో వాహనానికి సంబంధించిన ఇతర వివరాలేవీ తెలియరాలేదని వారన్నారు.

ట్రాఫిక్ పద్మవ్యూహం!



కాకినాడ బీచ్‌లో సముద్ర స్నానాలు చేస్తున్న సందర్శకులు (డ్రోన్ చిత్రం)



తిరుగు ప్రయాణంలో ట్రాఫిక్‌లో చిక్కుకున్న సందర్శకుల వాహనాలు

- కాకినాడ బీచ్‌కు సందర్శకుల తాకిడి
- తిరుగు ప్రయాణంలో ట్రాఫిక్‌లో ఇరుక్కుని వాహనదారుల అవస్థ

కాకినాడ రూరల్: వేసవి వేళ రోజంతా ఇళ్లలో గడిపి సరదాగా కాసేపు ఆహ్లాదకరమైన వాతావరణంలో సేదతీరేందుకు సాయంత్రం వేళ కాకినాడ బీచ్‌లకు వచ్చే సందర్శకులు ట్రాఫిక్ పద్మ వ్యూహంలో చిక్కుకుని ఇబ్బందులు పడుతున్నారు. రూరల్ మండల పరిధిలో సూర్యారావుపేట వద్ద న్యూ ఎన్టీఆర్, ఓల్డ్ ఎన్టీఆర్ బీచ్‌లకు పర్యాటకులు తాకిడి ఎక్కువగా ఉంటోంది. ముఖ్యంగా పండగ వేళలు, సెలవు రోజులు, ఆదివారం వేలాదిగా సాగర తీరానికి సందర్శకులు క్యూ కడుతున్నారు. కాకినాడ, రూరల్ ప్రాంత వాసులతో పాటు జిల్లా, ఇతర ప్రాంతాల నుంచి ద్విచక్ర వాహనాలు, ఆటోలు, కార్లలో బీచ్ మధ్యాహ్నం ఎండ వేడి తగ్గిన తరువాత వచ్చి సాయంత్రం చీకటి పడేవరకు గడిపి తిరుగు ప్రయాణం అవుతారు. ప్రస్తుతం పాఠశాలలకు వేసవి సెలవులు ఇవ్వడంతో చిన్నారులు ఇళ్లకే పరిమితవుతున్నారు. తమ పిల్లలతో సరదాగా బీచ్‌లో గడిపేందుకు తల్లిదండ్రులు మొగ్గు చూపుతున్నారు. బీచ్‌కు తరలివచ్చే సందర్శకుల సంఖ్య ఎక్కువయ్యే కొద్దీ రద్దీ అధికమవుతుంది. తిరుగు ప్రయాణంలో వాహనాలు ట్రాఫిక్‌లో చిక్కుకుని గంటల తరబడి వేచి ఉండవల్సి రావడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. న్యూ ఎన్టీఆర్ బీచ్ నుంచి బయటకు వంతెన మీదుగా సూర్యారావుపేట పంచముఖ ఆంజనేయ ఆలయం వద్ద బీచ్ రోడ్డుకు చేరుకునేందుకు ఇబ్బందులు పడుతున్నారు. మరో వైపు ఓల్డ్ ఎన్టీఆర్ బీచ్‌కు వచ్చే సందర్శకులు బీచ్‌రోడ్డులో ఇరుకు వంతెన వద్ద వాహనాలతో ట్రాఫిక్‌లో చిక్కుకోవడంతో ఉప్పాడ– కాకినాడ బీచ్ రోడ్డుపై రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. ట్రాఫిక్ సమస్య ఎప్పటి నుంచో ఉన్నప్పటికీ పోలీసులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయడం లేదు. బీచ్‌కు వచ్చే సందర్శకులు సాయంత్రం తిరుగు ప్రయాణంలో ఏక కాలం ఎక్కువ మంది బయటకు వచ్చినా ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా మరో మార్గం కూడా ఏర్పాటు చేయాల్సి ఉంది.

డ్రోన్ కెమెరాలతో నిఘా

కాకినాడ సూర్యారావుపేట బీచ్‌పై పోలీసులు డ్రోన్ కెమెరాలతో నిఘా ఉంచారు. బీచ్‌కు సందర్శకులు సంఖ్య పెరుగుతుండడంతో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా డ్రోన్ కెమెరాలను ఉంచి పోలీసులు రక్షణ చర్యలు చేపడుతున్నారు. సరదా కోసం సముద్ర జలాల్లో లోపలికి చొచ్చుకువెళ్లే వారు ప్రాణాలు కోల్పోయే ప్రమాదం కూడా ఉండడంతో పోలీసులు డ్రోన్ కెమెరాల పర్యవేక్షణ ద్వారా హెచ్చరికలు జారీ చేస్తున్నారు. సందర్శకులు బ్యాగ్‌లు, సెల్‌ఫోన్లను ఒడ్డున పెట్టి స్నానాలు వెళుతుండంతో దొంగతనాలు జరుగుతుండడంతో అనుమాని వ్యక్తులు సంచారంపై డ్రోన్ నిఘా ఉపయోగపడనుంది.

> **ప్రతి ఆదివారం పదివేలకు పైగా సందర్శకులు**
>
> సూర్యారావుపేట న్యూ, ఓల్డ్ ఎన్టీఆర్ బీచ్‌లకు వేసవిలో సందర్శకులు అధికంగా వస్తున్నారు. ముఖ్యంగా ఆదివారం 10వేలకు పైగా సందర్శకులు వస్తున్నారు. ఓల్డ్ ఎన్టీఆర్ బీచ్ వద్ద ఇరుకు వంతెన వద్ద ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. వంతెన వెడల్పు అయితే ట్రాఫిక్ సమస్య తగ్గుతుంది. న్యూ ఎన్టీర్ బీచ్‌లో ట్రాఫిక్ సమస్య పెద్దగా లేదు. వాహదారులు ఇబ్బందులు పడకుండా తిమ్మాపురం పోలీసులు ఆధ్వర్యంలో ట్రాఫిక్ నివారణ చర్యలు తీసుకుంటున్నాం.
>
> – చైతన్య కృష్ణ, సీఐ, కాకినాడ రూరల్

పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు

బోట్‌క్లబ్: ఇటీవల ప్రకటించిన పదవ తరగతి పరీక్షా ఫలితాల్లో ఉత్తీర్ణులు కాని విద్యార్థుల కోసం చేయూత సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 30 నుంచి ఉచిత ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నట్లు సంస్థ వ్యవస్థాపకుడు ఎం.రవికుమార్ సోమవారం తెలిపారు. స్థానిక టూటౌన్ సమీపంలో ఉన్న రోటరీ చేయూత భవన్‌లో ఈ ప్రత్యేక తరగతులను 30 నుంచి ప్రతి రోజు సాయంత్రం 4 నుంచి 6 గంటల వరకూ నిర్వహిస్తామన్నారు. విద్యార్థులు విద్యా సంవత్సరం వృథా కాకుండా ఉండేందుకు, వారు ఉన్నత విద్యకు ఎంపికవ్వాలనే ఉద్దేశ్యంతో ఈ తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. రవిశంకర్, వాణిప్రభ, ఎస్‌కే భాష, చింత నారాయణమూర్తి, శ్రీవివాస్, ఆలీమ్, కె తేజస్వితో కూడిన ఉపాధ్యాయ బృందం విద్యార్థులు ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహిస్తారని తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. శిక్షణా తరగతులకు హాజరయ్యే విద్యార్థులు వారి పేర్లను 86397 27476 నంబర్‌కు ఫోన్ చేసి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు.

కౌడా అంచనా బడ్జెట్‌కు ఆమోదం

కాకినాడ రూరల్: కాకినాడ అర్బన్ డవలప్‌మెంట్ అథారిటీ (కౌడా) 2025– 26 అంచనా బడ్జెట్‌కు పాలకవర్గం సోమవారం పాలవకర్గం ఆమోదం తెలిపింది. ఎన్ఎఫ్‌సీఎల్ రోడ్డులోని కౌడా కార్యాలయంలో చైర్మన్ తుమ్మల రామస్వామి(బాబు) అధ్యక్షతన బడ్జెట్ సమావేశం నిర్వహించారు. వైఎస్ చైర్మన్ భావన, కౌడా సెక్రటరీ కాళీబాబు, సభ్యులు పాల్గొన్నారు. తొలుత అంచనా బడ్జెట్‌ను వైస్ చైర్మన్ భావన ప్రవేశపెట్టడంతో ఆదాయ, వ్యయాలపై చర్చించిన అనంతరం ఆమోదించారు.

ఉగ్రదాడిని నిరసిస్తూ కొవ్వొత్తుల ర్యాలీ



ఉగ్రదాడికి నిరసనగా కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న టౌన్‌హాల్ కమిటీ సభ్యులు

బోట్‌క్లబ్: పెహల్గాం ఉగ్రవాదుల దాడిని నిరసిస్తూ టౌన్‌హాల్ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక మెయిన్‌రోడ్డులో సోమవారం రాత్రి కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. తొలుత ఉగ్రవాడిలో మృతి చెందిన వారికి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం కమిటీ అధ్యక్షుడు జి.సత్యనారాయణ (నానాజీ), కార్యదర్శి పాబోలు చిన్న పున్నయ్య ఆధ్వర్యంలో సభ్యులు స్థానిక మెయిన్‌రోడ్డు నుంచి ఎల్ఐసీ ప్రధాన కార్యాలయం మీదుగా కళామందిరం, సీతారామస్వామి ఆలయం వరకూ కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పాబోలు చిన పున్నయ్య మాట్లాడుతూ ప్రశాంత వాతావరణంలో ఉన్న జమ్మూ కశ్మీర్‌లో దాడులు చేయడం ద్వారా దేశంలో అలజడి సృష్టించాలన్న ఉగ్రవాదుల కుట్రలను ప్రజలంతా ఐక్యంగా భగ్నం చేయాలని కోరారు. గతంలో జరిగిన అనేక యుద్ధాల ద్వారా పాకిస్తాన్‌కు సరైన గుణపాఠం చెప్పినప్పటికీ భారత్‌ను అస్థిర పర్చడానికి తిరిగి ప్రయత్నం చేయడం శోచనీయమన్నారు. ఈ కార్యక్రమంలో టౌన్‌హాల్ కమిటీ ఉపాధ్యక్షులు జీవీ రఘునాథ్, సంయుక్త కార్యదర్శి వీవీ సుబ్రహ్మణ్యేశ్వరరావు, కోశాధికారి ఎమ్ సూర్యనారాయణరాజు తదితరులు పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో సమస్యల పరిష్కారానికి ఆదేశాలు



ఆప్తాల్మాలజీ ఓపీ విభాగంలో ఫ్యాన్ల మరమ్మతులపై సూచనలు ఇస్తున్న డాక్టర్ విఠల్

కాకినాడ క్రైం: కాకినాడ జీజీహెచ్‌లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి సూపరింటెండెంట్ డాక్టర్ ఎంపీఆర్ విఠల్ ఆదేశాలు జారీ చేశారు. సాధారణ తనిఖీల్లో భాగంగా సోమవారం ఆసుపత్రిలో పర్యటించిన ఆయన పలు వార్డులు, విభాగాల్లో సమస్యలు గుర్తించారు. అక్కడికక్కడే ఆదేశాలు జారీ చేసి మరమ్మతులు చేపట్టేలా చర్యలు తీసుకున్నారు. సర్జరీ మెడిసిన్ వార్డుల వెనుక పైప్‌లైన్ల లీకేజీ సమస్యను పరిష్కరించారు. కంటి వైద్య ఓపీ విభాగంలో ఫ్యాన్లు వేసినా గాలి రావడం లేదని హెచ్‌వోడీ, రోగుల ఫిర్యాదుపై ఆయన స్పందించి ఆదేశాలివ్వడంతో 15 ఫ్యాన్ల ఎత్తు తగ్గించేందుకు అదనపు రాడ్లు అమర్చారు. ఆప్తాల్మాలజీ డిపార్టుమెంట్‌లో పాత కమోడ్ తొలగించి సిరామిక్ వెస్ట్రన్ టాయిలెట్ కమోడ్‌ను అమర్చారు. ఓపీఎస్ఎస్ఆర్ స్పెషల్ రూమ్స్‌లో ఐదు ఏసీలకు మరమ్మతులు చేయించారు. ఎక్స్ రే యంత్రం మరమ్మతులకు ఆదేశాలిచ్చారు. డాక్టర్ విఠల్ చొరవతో ఈ యంత్రం సోమవారం సాయంత్రం నుంచి వినియోగంలోకి వచ్చింది.

సాంఘిక బహిష్కరణపై కేసు నమోదు చేయండి

కాకినాడ సిటీ: మల్లాం సాంఘిక బహిష్కరణ ఘటనపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలని విదసం (విస్తృత దళిత సంఘాల) ఐక్యవేదిక రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ బూసి వెంకటరావు డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టర్ షణ్మోహన్‌ను కలిసి మల్లాం సాంఘిక బహిష్కరణపై వినతిపత్రం అందించిన అనంతరం కలెక్టరేట్‌లో వెంకటరావు మాట్లాడారు. పిఠాపురం మండలం మల్లాంలో ఈనెల 20 నుంచి మూడు రోజుల పాటు దళితులను వెలివేసిన ఘటనపై జిల్లా అధికారుల తీరును నిరసిస్తూ కలెక్టర్‌ను కలసి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. విద్యుత్ ప్రమాదం వల్ల మరణించిన పల్లపు సురేష్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. మృతుడు భార్యకు ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని కోరారు. దోషులను కాపాడుతున్న అధికారులపై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. జనసేన పార్టీ కార్యకర్త చనిపోతే బాధిత కుటుంబాన్ని పరామర్శించకుండా ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ముఖం చాటేయడం నిందితులకు కొమ్ము కాస్తున్నట్టు భావించాల్సి వస్తుందని వెంకటరావు అన్నారు. ఈ కార్యక్రమంలో విదసం నాయకులు రేవు తిరుపతిరావు, జాబి ఓంకార్, బూల భాస్కరరావు, మూర మహేష్, గుబ్బల శ్రీనివాస్, రామకృష్ణ, అమలదాసు రాంబాబు, ఎస్ నూకరాజు, రాము పాల్గొన్నారు.

సోలార్ విద్యుత్ యూనిట్ల ఏర్పాటుకు రుణాలివ్వాలి



వివిధ బ్యాంకులు, విద్యుత్, డీఆర్‌డీఏ, డ్వామా అధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ షణ్మోహన్

కాకినాడ సిటీ: ప్రధానమంత్రి సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజన ద్వారా రూఫ్ టాప్ సోలార్ విద్యుత్ యూనిట్లు ఏర్పాటు చేసుకునే లబ్ధిదారులకు రుణాలందించేందుకు బ్యాంకర్లు చొరవగా ముందుకు రావాలని కలెక్టర్ షణ్మోహన్ సగిలి కోరారు. సోమవారం మధ్యాహ్నం కలెక్టరేట్ కోర్టు హాలులో కలెక్టర్ వివిధ బ్యాంకులు, విద్యుత్, డీఆర్‌డీఏ, డ్వామా అధికారులతో సమావేశం నిర్వహించి పీఎం సూర్యఘర్ యోజన, ఉపాధి హామీ కూలీలకు పీఎం సురక్ష బీమా యోజన, పీఎం జీవనజ్యోతి బీమా యోజన అమలు కార్యాచరణలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీఎం సూర్యఘర్ యోజన ద్వారా రూఫ్‌టాప్ సోలార్ యూనిట్ల ఏర్పాటుకు లబ్ధిదారులను చైతన్యపరచి దరఖాస్తు చేయించడం బ్యాంకుల ద్వారా రుణాల కల్పన, మార్జిన్ మనీ చెల్లింపు, డాక్యుమెంటేషన్ అంశాల్లో అనుసరించాల్సిన విధి విధానాలను ఆయన అధికారులకు వివరించారు. రూఫ్‌టాప్ విద్యుత్ యూనిట్ల ద్వారా లబ్ధిదారులకు నిలకడైన ఆదా, ఆదాయం చేకూరుతుందని, జిల్లాలో అర్హులైన వారందరికీ ఈ యూనిట్ల ఏర్పాటుకు బ్యాంకులు రుణాలు అందించాలని కోరారు. వచ్చే వారం నుంచి దరఖాస్తుల నమోదు ప్రారంభించి, త్వరితగతిన రుణాలు మంజూరు చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల కనుగుణంగా పీఎం సురక్ష, పీఎం జీవనజ్యోతి యోజనల ద్వారా అర్హులైన జాతీయ ఉపాధి హామీ కూలీలను బీమా రక్షణలో నమోదు, ప్రీమియం చెల్లింపు ప్రక్రియను డ్వామా, బ్యాంకుల అధికారులు ముమ్మరంగా చేపట్టాలని కలెక్టర్ షణ్మోహన్ కోరారు. ఈ సమావేశంలో ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ జి ప్రసాద్, డీఆర్‌డీఏ పీడీ ఏ శ్రీనివాసరావు, డ్వామా పీడీ పి వెంకటలక్ష్మి, ఎల్డీఎం సీహెచ్ఎస్‌వీ ప్రసాద్, వివిధ బ్యాంకుల అధికారులు పాల్గొన్నారు.

పోలీస్ పీజీఆర్ఎస్‌కు 88 ఫిర్యాదులు



అర్జీదారుల సమస్యలు తెలుసుకుంటున్న ఎస్పీ బిందుమాధవ్

కాకినాడ క్రైం: స్థానిక జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం పీజీఆర్ఎస్ నిర్వహించారు. ఎస్పీ బిందుమాధవ్ అర్జీదారులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన వారి నుంచి మొత్తం 88 ఫిర్యాదులు స్వీకరించామని ఎస్పీ తెలిపారు.

శిక్షణ తరగతుల ద్వారా విద్యార్థుల్లో సమగ్ర వికాసం



మాట్లాడుతున్న సమాచార పౌరసంబంధాల శాఖ డిప్యూటీ డైరెక్టర్ నాగార్జున

కాకినాడ సిటీ: పాఠశాల విద్యార్థుల్లో సమగ్ర వికాసం పెంపొందించేందుకు వేసవి సెలవులను సద్వినియోగం చేసుకునేలా గ్రంథాలయ సంస్థ నిర్వహించే శిక్షణా తరగతులు దోహదపడతాయని సమాచార పౌరసంబంధాల శాఖ డిప్యూటీ డైరెక్టర్ డి నాగార్జున అన్నారు. సోమవారం వివేకానంద పార్కులోని గాంధీనగర్ శాఖా గ్రంథాలయంలో ఈనెల 28 నుంచి జూన్ 6వ తేదీ వరకు నిర్వహించే వేసవి శిక్షణ తరగతులను ఆయన ప్రారంభించిన సందర్భంగా మాట్లాడారు. విద్యార్థినీ విద్యార్థుల్లో నిబిడీకృతమైన సృజనాత్మకశక్తిని ఈ వేసవి శిక్షణ శిబిరం ద్వారా మెరుగుపర్చుకోవాలని ఆయన సూచించారు. విద్యార్థులు ఆసక్తి ఉన్న కళను పూర్తిగా నేర్చుకుని అభివృద్ధి చెందాలన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కేంద్ర గ్రంథాలయ రిటైర్డ్ డిప్యూటీ లైబ్రేరియన్ సలాది సాయి సత్యనారాయణ మాట్లాడుతూ వేసవి శిక్షణ తరగతులను ఉపయోగించుకుని విద్యార్థులు విజ్ఞానవంతులు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న రిటైర్డ్ ఉపాధ్యాయులు నోరి బలరామకృష్ణ చక్కని గీతాలను ఆలపించి విద్యార్థులను ఉత్సాహపరిచారు. ఈ కార్యక్రమంలో లైబ్రేరియన్ ములంపాక శ్రీనివాసరావు, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పాలిసెట్ నిర్వహణకు ఏర్పాట్లు

కాకినాడ సిటీ: పాలిసెట్–2025ను ఈనెల 30 తేదీ ఉదయం 11 గంటల నుంచి 1 గంట వరకు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని, విద్యార్థులు గంట ముందే తమకు నిర్దేశించిన పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని కాకినాడ ఆంధ్రా పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ నల్లి జనార్దనరావు సోమవారం తెలిపారు. ఉదయం 11 గంటల తర్వాత పరీక్ష రాయడానికి అనుమతించరని అన్నారు. విద్యార్థులు హాల్ టికెట్‌తో పాటు బాల్ పెన్, పెన్సిల్, రబ్బరు తెచ్చుకోవాలన్నారు. హాల్ టికెట్ రాని అభ్యర్థులు ఈనెల 29వ తేదీ వరకు కాకినాడ జగన్నాథపురంలోని ఆంధ్రా పాలిటెక్నిక్ కళాశాల హెల్ప్‌లైన్ నంబర్‌లో సంప్రదించాలన్నారు. అభ్యర్థులు రిజిస్టర్ చేసిన అప్లికేషన్ జిరాక్స్‌ను, ఫీజు ఎస్సీ, ఎస్టీలు రూ. 100, ఇతరులు రూ. 400 చెల్లించి, రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలు సమర్పించి హాల్ టికెట్ పొందాలన్నారు.

రొచ్చుబండ..!





కళాశాల ఆవరణలో పేరుకుపోయిన చెత్త చెదారం



పాఠశాలలో నాటిన మొక్కల చుట్టూ చేరిన చెత్త

- అధికారులు నిర్లక్ష్యంతో అపారిశుధ్యం
- ఇబ్బంది పడుతున్న స్థానికులు

పిఠాపురం: ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఏర్పాటు చేస్తున్నామంటూ ప్రకటించిన రచ్చబండ కార్యక్రమం సమస్యల సేకరణ లేకపోగా కొత్త సమస్యను తెచ్చిపెట్టింది. పిఠాపురం ఆర్ఆర్‌బీహెచ్ఆర్ కళాశాల ప్రాంగణంలో గత 25వ తేదీన రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ రచ్చబండ కార్యక్రమం నిర్వహిస్తున్నారంటూ అధికారులు ఏర్పాటు చేశారు. అయితే అన్యూహ పరిణామాలు నేపథ్యంలో ఆ కార్యక్రమం అర్ధాంతరంగా రద్దయింది. రచ్చబండ కార్యక్రమం ఏర్పాటులో భాగంగా అధికారులు చేసిన ఏర్పాట్లలో ప్లాస్టిక్ వ్యర్థాలు పేరు పోయాయి. కార్యక్రమాన్ని రద్దు చేసిన అధికారులు ఆ పరిసరాలను శుభ్రం చేయడంలో మాత్రం నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపణ వినిపిస్తున్నాయి. గత మూడు రోజులుగా చెత్తను తొలగించకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రస్తుతం ఇదే కళాశాల ప్రాంగణంలో విద్యార్థులు క్రీడ వేసవి శిబిరాన్ని నిర్వహిస్తున్నారు. ప్రాంగణమంతా చెత్తతో నిండిపోవడంతో ఆటాడుకోవడానికి ఇబ్బందిగా ఉందంటూ విద్యార్థులు వాపోతున్నారు.

దేశ అభ్యున్నతికి శ్రమించిన పూలే, అంబేడ్కర్



పుస్తకావిష్కరణలో మాట్లాడుతున్న టీవీ గోపీనాథ్

కాకినాడ సిటీ: సమాజంలో మనుషుల మధ్య సమానత్వం కోసం, దేశ అభ్యున్నతి కోసం జీవిత కాలం శ్రమించిన దేశం గర్వించదగ్గ గొప్ప మహనీయులు జ్యోతిరావు పూలే, అంబేడ్కర్‌పై విశ్రాంతి తెలుగు అధ్యాపకులు చిలుకూటి కూర్మయ్య రచించిన పుస్తకావిష్కరణ కార్యక్రమం సోమవారం రాత్రి కాకినాడ కచేరిపేట యూటీఎఫ్ టీచర్స్ హోమ్‌లో నిర్వహించారు. జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి కేఎమ్ఎమ్ఆర్ ప్రసాద్ అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ ఇళ్ల వెంకటేశ్వరరావు, సత్యాస్కాన్ డైరెక్టర్ డాక్టర్ కాద వెంకటరమణ, ముఖ్యఅతిథులుగా హాజరై అంబ్కేర్ రచనల ప్రసంగాలు, జ్యోతిరావు పూలే జీవితచరిత్ర పుస్తకాలను ఆవిష్కరించారు. సమావేశంలో డాక్టర్ టీవీ గోపీనాథ్, ప్రముఖ అంబేడ్కరిస్టు అయితాబత్తుల రామేశ్వరరావు, యూటీఎఫ్ సీనియర్ నాయకులు జి ప్రభాకరవర్మ, టీవీజీజీఆర్ చక్రవర్తి పాల్గొన్నారు.